సాక్షి
వరంగల్
శుక్రవారం । 7 । మార్చి । 2025



రాములోరికి 'గోటి తలంబ్రాలు'

వరంగల్ బ్యాంక్‌కాలనీలోని మహిళలు భక్తి శ్రద్ధలతో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ వరిగింజలను గోటితో ఒలిచి తలంబ్రాలుగా తయారు చేస్తున్నారు. - 8లో



ఆర్టీఏపై విజిలెన్స్ నిఘా

వరంగల్ రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అందించే సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా వేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$35^0/19^0$

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:30	శని 5:08

ఇళ్ల పనులు షురూ..

ఎన్నికల కోడ్ ఎత్తేయడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం

- 13 మోడల్ విలేజ్‌ల్లో 1,162 మంది అర్హులు
- పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా నేతల కార్యక్రమాలు



సంగెం మండలం షాపూర్‌లో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సాక్షి, వరంగల్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పనులను గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రారంభిస్తున్నారు. ఫిబ్రవరి 21న నారాయణపేటలో ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ ఉండడంతో ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసే కార్యక్రమం ఆగింది. తమకు శుభ ముహూర్తం ఉందని కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొనకుండానే కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులు ముగ్గు పోసుకున్నారు. ఎన్నికల కోడ్ ఎత్తేయడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసే కార్యక్రమానికి గురువారం నుంచి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 13 మండలాల్లో ఉన్న 13 మోడల్ విలేజ్‌ల్లో గుర్తించిన 1,162 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధం అవుతున్నారు. ముగ్గు పోసే సమయంలో తప్పకుండా పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంది. లబ్ధిదారులు వారికి సమాచారం ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో నిర్మాణాల అనంతరం మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీకారం చుడతారు. అక్కడ లబ్ధిదారుల సర్వే సైతం పూర్తయ్యింది. 'పునాది పనులు పూర్తయిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొదటి విడత రూ.లక్ష లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారు. 400 చదరపు అడుగుల కంటే తక్కువ కాకుండా ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన కూపన్లను తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందాలి' అని గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారి గణపతి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 2,33,779 దరఖాస్తులు వస్తే 2,32,029 సర్వే పూర్తి చేశాం. తొలుత మోడల్ విలేజ్‌లో ఈ పథకానికి శ్రీకారం చుట్టి ఆ తర్వాత విడతల వారీగా మిగిలిన గ్రామాల్లో చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

గ్రామాల వారీగా ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల వివరాలు

మండలం	గ్రామం	ఎల్ 1	ఎల్ 2	ఎల్ 3
చెన్నారావుపేట	అమీనాబాద్	171	29	300
దుగ్గొండి	రేకంపల్లి	81	18	225
ఖానాపురం	రంగంపేట	129	5	180
నల్లబెల్లి	రామతీర్థం	46	13	103
నర్సంపేట	పర్శనాయక్ తండా	98	24	79
నెక్కొండ	బొల్లికొండ	183	5	300
రాయపర్తి	మహబూబ్‌నగర్	102	9	186
గీసుకొండ	కోనాయమాకుల	34	12	338
సంగెం	షాపూర్	134	1	211
పర్వతగిరి	జమలాపురం	74	6	126
వర్ధన్నపేట	వెంకట్రావుపల్లి	110	14	103
మొత్తం		1,162	136	2,151

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

- సొంత స్థలం ఉండి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్–1 కింద విభజించారు. వారు చూపిన స్థలాన్ని జియో ఫెన్సింగ్ చేశారు.
- సొంత భూమి లేని వారిని ఎల్–2 జాబితాలో చేర్చారు. వారికి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయిస్తారు.
- అద్దెకున్నవారు, సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఎల్–3 జాబితాలో చేర్చారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ/సంగెం: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గీసుకొండ మండలం కోనాయమాకుల, సంగెం మండలం షాపూర్‌లో అల్లం అనురాధ, రేష్మా, మదీన, కొయ్యల శ్రీలత లబ్ధిదారుల ఇళ్లకు గురువారం ఆయన ముగ్గు పోసి, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని నాలుగు విడతల్లో అందజేస్తుందని తెలిపారు. కోనాయమాకులలో జరిగిన కార్యక్రమంలో హౌసింగ్ డీఈ జ్ఞానేశ్వర్, గీసుకొండ ఎంపీడీఓ వి.కృష్ణవేణి, తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా షాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో హౌసింగ్ పీడీ గణపతి, డీఈ లాల్‌కృష్ణ, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీఓ కొమురయ్య, సొసైటీ చైర్మన్ సంపత్ గౌడ్, మాజీ సర్పంచ్ పేరాల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గీసుకొండ: మండలంలోని కొమ్మాలలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు అధ్యయనోత్సవాన్ని ప్రారంభించారు. సేవాకాలం తొలక్కం, ద్రవిడ ప్రబంధ పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, ఫణి, విష్ణు తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అధ్యయనోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి అనురాధ

ఖిలా వరంగల్: హమాలీ కార్మికులు, వారి కుటుంబాల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ అన్నారు. వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డులో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, వరంగల్ ఎస్ఎస్ఆర్, అపోలో, ఎలైట్ హాస్పిటల్స్, కాకతీయ నేత్ర వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైల్వే గూడ్స్‌షెడ్డులో ఎరువులను అన్‌లోడ్, లోడింగ్ చేసే హమాలీ కార్మికులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వీరికి వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా మండలాల వారీగా ఏర్పాటు చేయనున్న ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఏఓ సూచించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న హమాలీ కార్మికులకు ఆమె మందులు అందజేశారు. వైద్యులు, సిబ్బంది, కోరమండల్ డివిజనల్ హెచ్ఆర్ సుధాకర్, సీనియర్ మేనేజర్ సజన్‌కుమార్, ఆర్ఎల్ఎం శేషుకుమార్, గాయత్రి, సుమన్, శ్రీధర్, నరేశ్, కార్మిక నేత సారయ్య, అవంతి మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటుకు ఉత్తర్వులు

ఖిలా వరంగల్: జిల్లా రవాణాశాఖ కార్యాలయ పరిధిలో అధునాతన స్మార్ట్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన హైవేకు ఆనుకొని ఉండేలా ఐదు ఎకరాల అనువైన స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ సత్యశారదను గురువారం ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్‌బాబు కలిసి విజ్ఞప్తి చేశారు. అనువైన స్థలం లభిస్తే సెన్సార్ విధానంతో కూడిన అధునాతన స్మార్ట్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని ఆయన పేర్కొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా రమేశ్

వరంగల్: కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రమేశ్‌ను వరంగల్ ఆర్డీఓ కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(డీఏఓ)గా డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న అబీద్‌ను బదిలీ చేశారు. ఈరెండు డిప్యూటేషన్ బదిలీలే అని కార్యాలయవర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

శ్రీరంగానికి ఉగాది పురస్కారం



పర్వతగిరి: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి శ్రీరంగం విశ్వశాంతి జాతీయస్థాయి ఉగాది పురస్కారం అందుకున్నారు. 30 సంవత్సరాలుగా జిల్లాలోనే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదే రాష్ట్రాలతోపాటు రేడియో, టీవీ, రవీంద్రభారతిలో పలు ప్రదర్శనలు ఇచ్చారు. అతడి ప్రతిభను గుర్తించిన శ్రీఆర్యాని సకల కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దూడపాక శ్రీధర్ జాతీయస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఈనెల 5న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరంగానికి అవార్డు అందజేసి సత్కరించారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

కాశీబుగ్గ సెంటర్: జిల్లా వ్యాప్తంగా గురువారం 26 కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయని ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. మొదటి రోజు 4,838 మంది జనరల్ విద్యార్థులకు 4,718 మంది హాజరు కాగా.. 120 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 668 మంది ఒకేషనల్ విద్యార్థులకు 635 మంది హాజరుకాగా.. 33 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ లేకుండా ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభమయ్యాయని డీఐఈఓ వివరించారు.

శివలింగాన్ని తాకిన సూర్య కిరణాలు



చెన్నారావుపేట: మండల కేంద్రంలోని శ్రీసిద్ధేశ్వరాలయంలోని శివలింగాన్ని గురువారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ఈ సమయంలో అర్చకులు బీఎం శాస్త్రి, సాయిశాస్త్రి, గణేశ్‌శాస్త్రి మాట్లాడుతూ సూర్యకిరణాలు శివుడిని తాకడం శుభపరిణామమని, ప్రతి సంవత్సరం వసంత రుతువులో సూర్యకిరణాలు ఒకసారి తప్పనిసరిగా సిద్ధేశ్వరుడిని తాకుతాయని చెప్పారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి



కాకి స్వామి (ఫైల్)

నర్సంపేట రూరల్: ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడిన సంఘటన నర్సంపేట శివారులోని కమలాపురం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామానికి చెందిన పోశాల పూలమ్మ, కాకి స్వామి (55) ముత్తోజిపేట నుంచి ఆటోలో నర్సంపేట వైపు వెళ్తున్నారు. కమలాపురం క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా కారు రావడంతో ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో కిందపడిపోయింది. ఆటోలో నలుగురు ఉండగా పోశాల పూలమ్మ, కాకి స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. కాకి స్వామి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కోమల, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యతోనే మహిళా సాధికారత



కలెక్టర్ సత్యశారదను సన్మానిస్తున్న యూనివర్సిటీ అధికారులు

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవం

కేయూ క్యాంపస్: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. వివిధ పదవుల నిర్వహణలోనూ సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయంలో పరిపాలనా పదవుల్లోనూ మహిళలకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. మహిళలు మల్టీటాస్కర్స్ అన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యశారదను సన్మానించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షాలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ బి.రమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.స్వప్న, పలువురు బోధన బోధనేతర సిబ్బంది పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

11న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

వరంగల్: బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 11న నిర్వహించనున్న జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక జానపద నృత్యం (గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ (గ్రూప్, వ్యక్తిగత) అంశాల్లో పోటీలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచ ప్రాణ్ అంశంపై పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. గ్రూప్, ఫోక్‌డ్యాన్స్, ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో పంచ్ ప్రాణ్ అంశం వర్తించదని వివరించారు. ఉత్సాహవంతులైన ఫొటోగ్రాఫర్లు తమ సెల్‌ఫోన్లు, తెచ్చుకున్న కెమెరాలతో పోటీ ప్రదేశంలో ఇచ్చిన థీమ్‌ను ఫొటోలు తీసి చూపిస్తారని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతితోపాటు ప్రశంసపత్రాలు అందజేస్తామని వెల్లడించారు. జిల్లాలోని యువజన సంఘాలు, కళాశాల విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 76758 24707/95733 93831 నంబర్లలో సంప్రదించాలని అన్వేష్ సూచించారు.

ఏజే మిల్లు కార్మిక భవన స్థలం సర్వే



సర్వేకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలో ఉన్న ఏజే మిల్లు కార్మిక భవనం మ్యూటేషన్, రిజిస్ట్రేషన్‌తో పాటు నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని ఏజే మిల్లు భూముల పరిరక్షణ సమితి జేఏసీ, పలు సంఘాల నాయకులు ఆందోళనలు చేశారు. పలుమార్లు కలెక్టర్ సత్యశారద, కమిషనర్ వాకడేకు వినతిపత్రాలు సమర్పించి ల్యాండ్ సర్వే విభాగంతో సర్వే చేయించాలని కోరారు. ఈనేపథ్యంలో గురువారం ల్యాండ్ సర్వే శాఖ ఏడీ దేవరాజ్, డీఏ భుజంగరావు, సర్వేయర్ సందీప్ కార్మిక భవనం స్థలాన్ని రీ సర్వే చేశారు. జేఏసీ నాయకులు స్థలం వద్దకు వచ్చి ఏడీతో కాకుండా డీడీ నేతృత్వంలో సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతోనే వచ్చామని అధికారులు తెలపడంతో నాయకులు సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి జేఏసీ నాయకులు గంగుల దయాకర్, ఆకెన వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల లక్ష్మణ్, డాక్టర్ కొనతం కృష్ణ, ఇనుముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ, జన్ను రమేశ్, కోమాకుల నాగరాజు, భాస్కర్, కార్మికులు పాల్గొన్నారు.

'పొలంబాట'తో సత్ఫలితాలు

పరిష్కారమవుతున్న విద్యుత్ సమస్యలు

- క్షేత్రస్థాయికి వెళ్తున్న ఎన్పీడీసీఎల్ అధికారులు
- విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన
- హనుమకొండ జిల్లాలో 277, వరంగల్ జిల్లాలో 40 పొలంబాట కార్యక్రమాలు



వర్ధన్నపేట మండలం టేకులతండాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు (ఫైల్)

హన్మకొండ: విద్యుత్ అధికారులు చేపట్టిన పొలంబాట కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. రైతులకు ఉత్తమమైన సేవలు అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టింది. డీఈ, ఏడీఈ, ఏఈ, ఇతర అధికారులతోపాటు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్లు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి నేరుగా సమస్యలు తెలుసుకుంటున్నారు.

రైతులు తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల పట్ల అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఆటోమేటిక్ స్టార్టర్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, కెపాసిటర్లు అమర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. వంగిన స్తంభాలు, లూజ్ లైన్లు సరిచేయడం, మధ్య స్తంభాలు ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు పెంచడం వంటి అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. పొలాల్లో లూజ్ లైన్లు, ఎత్తుగా తక్కువగా విద్యుత్ లైన్లు ఉండడంతో వరి కోతల సమయంలో హార్వెస్టర్లకు తగిలి విద్యుదాఘాతానికి గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లూజ్ లైన్లు, కిందకు ఉన్న లైన్ల ఎత్తును పెంచుతున్నారు. ఎత్తు పెంచేందుకు 9.1 మీటరు ఎత్తున్న విద్యుత్ స్తంభాలు నాటుతున్నారు.

వరంగల్ జిల్లా (సర్కిల్) పరిధిలో..

- ఇప్పటివరకు 40 పొలంబాట కార్యక్రమాలు చేపట్టారు.
- ఇందులో 236 వంగిన స్తంభాలు, 739 లూజ్ లైన్లు సరిచేశారు.
- 659 మధ్యస్తంభాలు ఏర్పాటు చేశారు.
- తక్కువ ఎత్తులోఉన్న 98 ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచారు.
- ఇప్పటివరకు 76 డబుల్ ఫీడింగ్, 134 లో లెవెల్‌లైన్ క్రాసింగ్‌లను మార్చారు.
- హార్వెస్టర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలతోపాటు తక్కువ ఎత్తులో లైన్ల స్థానాల్లో 9.1 మీటరు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.

రైతుల ముంగిట్లో విద్యుత్ అధికారులు..



పొలంబాట ద్వారా రైతుల ముంగిటికి విద్యుత్ అధికారులు వెళ్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. రైతులకు సేవలు అందించేందుకు అధికారులందరం కంకణబద్ధులై ఉన్నాం. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలి. - కె.గౌతంరెడ్డి, వరంగల్ సర్కిల్ ఎస్ఈ

ఎంజీఎంలో మరమ్మతుల పరిశీలన



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రితో పాటు కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని గురువారం విద్యుత్ శాఖ అధికారులు సందర్శించారు. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించడానికి ఎంజీఎంలో ఆస్పత్రిలో ఉన్న ఆటో జనరేటర్ వర్కింగ్ కండిషన్లను పరిశీలించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మరమ్మతులో ఉన్న జనరేటర్‌ను వాడకంలోకి తేవాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజినీర్ గౌతమ్‌రెడ్డి, డీఈ మల్లికార్జున్, ఏడీ సురేశ్, ఏఈ రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

బీరు బాటిళ్లలో స్ప్రాన్లు



బీర్‌బాటిల్‌లో కనిపిస్తున్న స్ప్రాన్

దుగ్గొండి: బీరు బాటిళ్లలో స్ప్రాన్లు కనిపించడంతో మందుబాబులు కంగుతున్న సంఘటన గిర్నిబావిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా జరిగిన ఓ శుభకార్యానికి వచ్చిన బంధుమిత్రులు కలిసి మద్యం సేవిస్తున్నారు. ఓ బాటిల్‌లో స్ప్రాన్ మొత్తం ఉండగా.. మరో బాటిల్‌లో సగం విరిగిన స్ప్రాన్ కనిపించింది. దీంతో ఆందోళన చెందిన మందుబాబులు స్థానికంగా తాము కొనుగోలు చేసిన మద్యం షాపు వద్దకు వెళ్లి యజమానిని నిలదీశారు. అయితే బాటిల్‌లో ఉన్న స్ప్రాన్ బయటికి రావడం లేదు. ఖాళీ బాటిల్ తయారు చేసే క్రమంలోనే అందులో చేరి ఉంటుందని, అది గమనించకుండా మద్యం నింపారని గుర్తించారు. కేఎఫ్ లైట్ కంపెనీకి చెందిన బీర్లు కావడంతో షాపు యజమాని వాటిని వాపస్ తీసుకుని రెండు బాటిళ్లు మళ్లీ ఇచ్చాడు. ఈ ఘటనను సదరు కంపెనీ దృష్టికి తీసుకెళ్తామని షాపు నిర్వాహకులు తెలిపారు.

కవలల పెళ్లి సందడి


కవల దంపతులు

దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఓ కవలల పెళ్లి సందడి గురువారం ప్రత్యేకతను సంతరించుకుంది. సీతారాంపురం గ్రామానికి చెందిన కవలలు (అన్నదమ్ములు) శ్రీకాంత్, సుకన్య, శ్రీనివాస్, మానసల వివాహం రెండు నిమిషాల తేడాతో జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఒకే వేదికపై నిర్వహించారు.

ఖండాంతరాలు దాటిన ప్రేమ

- ఒక్కటైన కొలంబియా యువతి, కేసముద్రం యువకుడు


కొలంబియా యువతి రియాను పెళ్లి చేసుకుంటున్న కేసముద్రం యువకుడు సాయిచైతన్య

కేసముద్రం : కొలంబియా యువతి, కేసముద్రం యువకుడు ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో ఒక్కటయ్యారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కి చెందిన సాయిచైతన్య ఆస్ట్రేలియాలో ఓ కంపెనీలో ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కొలంబియా దేశానికి చెందిన రియా అదే కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. ఇద్దరు ప్రేమించుకుని పెద్దలను ఒప్పించారు. వారి అంగీకారంతో గురువారం కేసముద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో ఒక్కటయ్యారు.

రాములోరికి 'గోటి తలంబ్రాలు'

- చేతిగోళ్లతో ఒక్కో వరి గింజను ఒలిచి..
- నవమి నాటికి అక్షింతల బియ్యం సిద్ధం

హన్మకొండ కల్చరల్ : రాములోరి కల్యాణం.. కమనీయం.. రమణీయం..చూసిన కనులదే భాగ్యం.. భద్రాద్రిలో జరిగే వేడుకను తిలకించి..తరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వీరిలో ఓరుగల్లు మహిళలు పరిణయ వేడుకకు తలంబ్రాలను సిద్ధం చేయడానికి వరిగింజలను గోటితో ఒలిచి తమ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు.

గోటి తలంబ్రాలు..

శ్రీరామ నవమి రోజు భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలకు ప్రత్యేకత ఉంది. వడ్ల గింజలను రోలులో దంచడంగాని లేక మిల్లులో మరపట్టించినవి కావు.. మహిళలు చేతిగోళ్లతో ఒక్కొక్క ధాన్యపు గింజను వలచిన బియ్యం. వీటినే గోటి తలంబ్రాలు అంటారు.

ఎంతో పవిత్రంగా..

శ్రీరామనామ స్మరణతో ఎంతో పవిత్రంగా గోటితో తలంబ్రాలు ఒలుస్తారు. ఈ తలంబ్రాల కోసం విత్తనాల వడ్లను ప్రత్యేకంగా సాగు చేస్తారు. శ్రీరాముడి కల్యాణ తంతు జరుగుతున్నప్పుడు తలంబ్రాలతో పాటు సాగుచేయడానికి కావలసిన వడ్లను కూడా స్వామివారి పాదాల వద్ద పెడతారు. ఆ వడ్లనే తిరిగి సాగుచేయడానికి వాడుతారు. వీటిని కొందరు భక్తిభావంతో తమ పొలంలో కొంత భూమిని కేటాయించి సాగు చేస్తుంటారు. ప్రత్యేక ముడుపులుగా చేసి మందులు, ఎరువులు వేయకుండా, కాళ్లతో తొక్కకుండా, పవిత్రంగా


వరి ధాన్యాన్ని గోటితో ఒలుస్తున్న మహిళలు

ధన్యులమయ్యాం..



రాముల వారి కల్యాణంలో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు.. ఈ అక్షింతలను కోటి తలంబ్రాలుగా చెబుతారు. గోటీ తలంబ్రాల కార్యక్రమంలో భాగస్తులైనందుకు ధన్యులమయ్యాం. - పంతుల సుధామాధురి

పండిస్తున్నారు. వంటపొలాల్లో కంకులను కూడా కత్తులతో కాకుండా శ్రీరామనామం జపిస్తూ చేతిలో వలుస్తారు.

కొరియర్ ద్వారా..

వరి ధాన్యాన్ని తలంబ్రాలుగా ఒలిచేందుకు భద్రాచలం నుంచి శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ప్రతినిధులు కొరియర్ ద్వారా పంపగా వరంగల్ బ్యాంక్‌కాలనీలోని ఏలిషాల సుజాత అందుకున్నారు. ఈ ధాన్యాన్ని కాలనీ మహిళలు నిత్యం నిష్ఠతో ఉండి భక్తిశ్రద్ధలతో శ్రీరామ కీర్తనలు ఆలపిస్తూ, శ్రీరామ స్మరణ చేస్తూ గోటితో ఒలిచి.. తలంబ్రాలుగా

మా ఇంట్లోనే తలంబ్రాలు చేస్తాం..



ఫిబ్రవరి 15న భద్రాచలం నుంచి 2 కిలోల వడ్లను అందుకుని వలిచే కార్యక్రమాన్ని మా ఇంట్లో ప్రారంభించాము. ఈ నెల 8న శనివారం ఒలిచిన బియ్యాన్ని భద్రాచలానికి పంపిస్తాం. శ్రీసీతారాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించుకుని నియమ నిష్ఠలతో కాలనీ మహిళలతో కలిసి ఒలిచే కార్యక్రమం మా ఇంట్లో తలంబ్రాలుగా తయారు చేయడం సంతోషంగా ఉంది.

- ఏలిషాల సుజాత, బ్యాంక్‌కాలనీ, వరంగల్

ఆనందంగా ఉంది



శ్రీరామ నామాన్ని స్మరిస్తూ భక్తిభావంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. భగవంతుని సేవ చేయడం వల్ల మాకు మంచి జరుగుతుందనే భావన. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తోటి మహిళలతో స్నేహబంధాలు పెరుగుతాయి.

- లావణ్య, బ్యాంక్‌కాలనీ, వరంగల్

తయారు చేస్తున్నారు. ఈ నెల 8న శనివారం ఒలిచిన తలంబ్రాలను కొరియర్ ద్వారా భద్రాచలం రాములవారికి పంపిస్తారు. సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తున్నామని మహిళలు చెబుతున్నారు.

ఆర్టీఏపై విజిలెన్స్ నిఘా

- తరచూగా ఆకస్మిక పరిశీలన, తనిఖీలు


వరంగల్ రవాణాశాఖ కార్యాలయం

ఖిలా వరంగల్ : వరంగల్ రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అందించే సేవలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. అధికారుల పనితీరు, వాహనదారులకు అందించే సేవలపై రహస్యంగా పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బాలకోటి ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ రవాణాశాఖ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీరో కౌంటర్ల వద్ద అందజేస్తున్న సేవలు, వాహన ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ విధానం, ఆన్‌లైన్ డ్రైవింగ్ పరీక్షలను స్వయంగా పరిశీలించారు. అనంతరం జీరో కౌంటర్లలో సోదాలు చేసిన అధికారులు ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్ బాబును కలిసి సేవలకు సంబంధించిన కొన్ని పత్రాలను అడిగి తీసుకున్నారు. దళారుల కార్యాలయాల్లో ఏమైనా వాహనదారులకు చెందిన ఫైల్స్ ఉన్నాయా.. అనే దానిపై ఆరా తీశారు. అధికారుల పనితీరు, రవాణాశాఖ అందజేస్తున్న సేవలపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పెళ్లి వద్దని ఆత్మహత్యాయత్నం

- మానుకోట ఎస్సై సమాచారంతో కాపాడిన కాజీపేట జీఆర్పీ అధికారులు
- తండ్రికి విద్యార్థిని అప్పగింత


తండ్రికి విద్యార్థినిని అప్పగిస్తున్న జీఆర్పీ కానిస్టేబుల్ కమలాకర్

కాజీపేట రూరల్ : పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని ఓ విద్యార్థిని కాజీపేట జంక్షన్ రైల్వే యార్డులో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకొని ఆమె తండ్రికి అప్పగించిన సంఘటన కాజీపేటలో జరిగింది. జీఆర్పీ కానిస్టేబుల్ ఆర్.కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నందిని హాస్టల్‌లో ఉంటూ బీటెక్ చదువుతోంది. ఇంటికి వచ్చిన నందినికి పెళ్లి చేస్తానని చెప్పడంతో తల్లి కూతుళ్ల మధ్య గొడవ జరిగింది. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని నందిని బుధవారం ఇంటి నుంచి వచ్చి కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అదే రోజు రాత్రి నందిని కాజీపేటలో ప్రయాణికుడి సెల్‌ఫోన్ నుంచి తండ్రికి ఫోన్ చేసి కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఉన్నానని, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. అప్రమత్తమైన తండ్రి మహబూబాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సమాచారంతో కాజీపేట జీఆర్పీ పోలీసులు రైల్వే యార్డు ఆర్‌ఆర్‌ఐ సమీపంలో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్న నందినిని గుర్తించి అదుపులోకి తీసుకొని జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. తండ్రిని పిలిపించి జీఆర్పీ అధికారుల ఆదేశాలనుసారం నందినిని తండ్రి అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు, జరిమానా

మడికొండ : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం .. కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన మీరాల రాజు 2017, జూలై 22న సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. అప్పటి ఎస్సై మధుప్రసాద్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారణలో భాగంగా గురువారం కానిస్టేబుల్ వి.రాజేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టాడు. ప్రాసిక్యూషన్ తరఫున ఎస్.దుర్గబాయ్ వాదించగా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో హనుమకొండ మొదటి అదనపు న్యాయమూర్తి చింతాడ శ్రావణ స్వాతి నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.6,000ల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం..ట్రాలీ బోల్తా

- వాహనంలో 37మంది కూలీలు
- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- కోనాపురం శివారులో ఘటన


బానోత్ సుక్య మృతదేహం

చెన్నారావుపేట : డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాలీ వాహనం బోల్తా పడిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కోనాపురం శివారులో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన 37 మంది వ్యవసాయ కూలీలను ఇటుకాలపల్లి శివారు ఇప్పల్ తండాకు చెందిన ధరావత్ మైబూ మిర్చి ఏరేందుకు కూలీలను తీసుకు రమ్మని జీడిగడ్డ తండాకు చెందిన భూక్య సమ్మికి చెప్పాడు. బానోత్ సుక్యతో పాటు 37 మందిని కూలీలను తీసుకొని గూడ్స్ వాహనంలో గురువారం ఉదయం ఇప్పల్ తండాకు బయలుదేరారు. గార్లగడ్డ తండాకు చెందిన ట్రాలీ డ్రైవర్ అజ్మీరా సంతోష్ వాహనాన్ని అతివేగంగా నడపడంతో పాటు ఎక్కువ మంది ఉండడం వల్ల కోనాపురం శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న 37 మంది కూలీలు కింద పడ్డారు. అందులో కొందరికి తీవ్ర గాయాలు, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోతరాజు రాజు, పున్నం నర్సయ్య వెంటనే 108తో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజేష్‌రెడ్డిలు చేరుకుని క్షతగాత్రులను నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో బానోత్ సుక్య (55) మృతిచెందాడు. బానోత్ ఈర్య, ఆంగోత్ జమ్లి, నూనావత్ అంబాలి, బానోత్ బుజ్జి, సంపుతోపాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్నవారిని ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుమారుడి మోహన్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం..

వాహనం బోల్తా పడిన ప్రదేశంలో పెద్ద బండరాయి ఉంది. ఒకవేళ వాహనం బండరాయి పై పడి ఉంటే మరికొందరు మృత్యువాత పడేవారని స్థానికులు చెబుతున్నారు.


క్షతగాత్రుల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బతికి బయట పడ్డా..



నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన రైతు పంపిన వాహనంలోనే మిర్చి ఏరడానికి వెళ్లాను. వాహనం స్పీడ్‌గా వెళ్తుంది. ఒక్కసారి కోనాపురం శివారులో బోల్తా పడింది. కొద్దిసేపు ఏం జరిగిందో అర్థం కాలే. చాలా మందికి దెబ్బలు తగిలాయి. నాకు స్వల్పంగా గాయాలయ్యాయి.ఆ ప్రమాదం చూస్తే చనిపోయాననుకున్నా. దేవుడు మరో జన్మనిచ్చాడు.

- బానోత్ అరుణ, ట్రాలీలో ఉన్న కూలీ

కళ్ల ముందే బోల్తా పడింది..



కూలీలతో వెళ్తున్న వాహనం బోల్తాపడిన సమీపంలోనే నా వ్యవసాయ భూమి ఉంది. పంటకు నీళ్లు పెట్టి బయటికి వచ్చాను. చూస్తుండగానే అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. వెంటనే అక్కడికి వెళ్లి వాహనంలో ఉన్న వారి సాయంతో అందరిని బయటికి తీశాం. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగింది.

- పున్నం నర్సయ్య, ప్రత్యక్ష సాక్షి

భళా.. ఇత్తడి హస్తకళ

- రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక గుర్తింపు
- వరంగల్‌కు దక్కిన గౌరవంపై ప్రశంసలు
- ప్రత్యేక ఆకృతులతో ఆకట్టుకుంటున్న స్టాల్


న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన రంగశాయిపేట హస్తకళ స్టాల్

సాక్షి, వరంగల్ : వరంగల్ జిల్లా రంగశాయిపేట ఇత్తడి హస్తకళకు దేశ రాజధానిలో ప్రత్యేక గుర్తింపు దక్కుతోంది. కాకతీయుల కాలం నాటి వెండి నగిషీలు తయారుచేసే పెంబర్తి హస్తకళకు దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉంటే.. వాటి సరసన రంగశాయిపేట ఇత్తడి హస్తకళ పోటీపడుతోంది. అమృత్ మహోత్సవ్‌లో భాగంగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం నుంచి జరుగుతున్న దక్షిణ భారత ఎగ్జిబిషన్‌లో రంగశాయిపేట ఇత్తడి హస్తకళ స్టాల్‌కు చోటు లభించింది. ఓ వైపు సాంస్కృతిక ప్రతిరూపాలను తెలిపే డిజైన్లు, మరోవైపు నేటి కాలానికి తగ్గట్టుగా మోడ్రన్ డిజైన్ విత్ ఎంబోజింగ్ వర్క్ ద్వారా విభిన్న హస్తకళ డిజైన్లు చేస్తుండడంతో వీటికి ప్రత్యేక గుర్తింపు లభించింది. నాబార్డు, డీసీహెచ్ మద్దతుతో వందలాది కుటుంబాలకు ఈ హస్తకళ నైపుణ్యంపై శిక్షణ ఇచ్చి భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా రంగశాయిపేట ఇత్తడి హస్తకళ బంధం ముందుకెళ్తోంది. 'రాగి లేదా ఇత్తడి లోహాన్ని సన్నని షీట్లుగా కొట్టి, చక్కటి తీగగా కట్ చేస్తాం. చెక్క ఉపరితలంపై గుర్తించబడిన డిజైన్‌ను సుత్తి, ఉలి సాయంతో కోస్తాం. ఇత్తడి లేదా రాగి తీగను డిజైన్‌తో చెక్కబడిన భాగంలోకి సుత్తితో గుచ్చుతాం. ఆ తర్వాత రంపంతో కత్తిరించి డిజైన్‌లో కావల్సిన ప్రదేశాలలో జిగురుతో బిగిస్తాం. అత్యాధునిక పద్ధతులతో వివిధ డిజైన్లతో వస్తువులను తయారు చేస్తున్నాం. ఇంటిరియర్ వర్క్‌లో ఫ్లవర్ వాజెస్, వాల్ ప్యానెల్స్, డోర్ ప్యానెల్స్ చేస్తున్నాం.అలాగే దేవాలయం, దేవుళ్ల ఫొటోలతో కూడా ఎంబోజింగ్ వర్క్‌తో అది కూడా చేతి ద్వారా చేయడంతో ఆయా బొమ్మల ఆకారం స్పష్టంగా కనబడుతుంద'ని రంగశాయిపేట ఇత్తడి హస్తకళ బృంద సభ్యుడు ప్రణయ్ గురువారం 'సాక్షి'కి వివరించారు. అలాగే వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. రంగశాయిపేట ఇత్తడి హస్తకళలకు రాష్ట్రపతి నిలయంలో జరిగిన అమృత్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ లో చోటు దక్కడం జిల్లాకు దక్కిన గుర్తింపు. మరోసారి చేతికళలకు నిలయమని దేశమంతటా తెలిసింది. ఈ హస్త కళాకారులు భవిష్యత్‌లో ఇత్తడితో విభిన్న డిజైన్లు చేసి ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

శరవేగంగా భూ సర్వే

- సర్వేకు రైతుల సుముఖత
- ఎయిర్ పోర్ట్ రన్‌వేకు 253 ఎకరాల భూమి సేకరణ


సర్వే చేస్తున్న తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది

ఖిలా వరంగల్ : మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. భూ సర్వేకు రైతుల సైతం సుముఖంగా ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్ల నిధుల విడుదల చేసింది. కలెక్టర్ ఆదేశాలతో గురువారం తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నక్కలపల్లి, గాడిపల్లి గ్రామ శివారులో శరవేగంగా భూ సేకరణకు సర్వే చేపట్టారు. రైతుల సహకారంతో తొలిరోజు 170 ఎకరాల భూ సర్వే చేసి హద్దులు గుర్తించారు. అనంతరం భూ నిర్వాసితుల నుంచి వ్యక్తిగత వివరాలను సేకరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సహకారంతో తొలిరోజు నక్కలపల్లి-47, గాడిపల్లి శివారు పరిధిలో 123, మొత్తం 170 ఎకరాలు సర్వే చేశామని తెలిపారు. మిగిలిన 83 ఎకరాల భూమి మరో మూడ్రోజుల్లో పూర్తి చేసి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం సర్వేకు సహకరించిన రైతులకు తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్వేలో ఆర్ఐ ఆనంద్‌కుమార్, సర్వేయర్ రజిత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుమారుడిని ఎస్సై అకారణంగా తిట్టాడని..

- పొలంవద్ద పురుగుల మందుతాగిన తండ్రి
- వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా
- ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్


పురుగుల మందు తాగిన మల్లునాయక్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

రాయపర్తి: న్యాయం చేయాలని స్టేషన్‌కు వస్తే ఎస్సై.. తమ కుమారుడిని అకారణంగా తిట్టాడంటూ ఓ తండ్రి వ్యవసాయపొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ ఆ రైతు కుటుంబ సభ్యులు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఎర్రకుంటతండా గ్రామానికి చెందిన భూక్య మల్లునాయక్ తనకున్న మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. తన పక్కనే ఉన్న మరో రైతు సపావత్ ద్వాల్యానాయక్ గతంలో తన భూమిలో బోరు వేయించుకున్నప్పుడు భవిష్యత్‌లో మల్లు బోరు వేసుకున్నా అభ్యంతరం చెప్పనని ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. యాసంగి వరిసాగు చేస్తున్న క్రమంలో భూక్యా మల్లునాయక్‌కు చెందిన వరిపంట ఎండిపోతుండడంతో బోరు వేయించేందుకు బోరుబండిని తీసుకు వచ్చాడు. వేరేచోట వేయించుకోవాలంటూ ద్వాల్యానాయక్ కుటుంబం బోరుబండిని పంపించారు. దీంతో ఆగ్రహానికి గురైన భూక్య మల్లునాయక్, కుటుంబ సభ్యులతో కలిసి ద్వాల్యా నాయక్‌కు చెందిన బోరు స్టార్టర్‌ను తీసుకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మల్లునాయక్‌తో వచ్చిన తన కుమారుడిని ఎస్సై 'ఏం చదువుకున్నవు' అంటూ ఇష్టమొచ్చిన బూతులు తిడుతూ 'నువ్వు చస్తే చావు నాకేం సంబంధం' అనడంతో ఆవేశానికి లోనైన మల్లునాయక్ తన వ్యవసాయ పొలానికి చేరుకొని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మల్లు నాయక్ కుటుంబ సభ్యులు రాయపర్తిలోని పోలీస్ స్టేషన్ ఎదుట వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ తనను అకారణంగా బూతులు తిట్టాడని తండ్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఎస్సైని సస్పెండ్ చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. వర్ధన్నపేట, జఫర్‌గఢ్ ఎస్సైలు చందర్, రామ్‌చరణ్‌లు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికి వినలేదు. ఎస్సైని సస్పెండ్ చేస్తేనే ఇక్కడి నుంచి వెళ్తామని పట్టుబట్టారు. చీకటిపడే వరకు వారంతా అక్కడే ఉన్నారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని నేడు (శుక్రవారం) కూడా ఆందోళన చేస్తామని అక్కడినుంచి వెళ్లిపోయారు.

గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్ : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 10 కిలోల 102 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ పి.సర్వయ్య తెలిపారు. పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సర్వయ్య కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గంజాం జిల్లా బడఖరిడకు చెందిన బరున బరడ్ సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒడిశాలోని ఒకరివద్ద నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేశాడు. సూరత్‌లో అధిక ధరకు విక్రయించేందుకు విజయవాడ మీదుగా వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేస్తున్నారని తెలుసుకుని మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. తొర్రూరు మీదుగా వరంగల్ వెళ్లేందుకు ఆటో ఎక్కి వెళ్తుండగా శనిగపురం వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా ఆటోదిగి పారిపోయే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకుని, 10 కిలోల 102 గ్రాముల (రూ.5.05 లక్షల విలువగల) ఎండు గంజాయి, మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై దీపిక, ట్రెయినీ ఎస్సై నరేష్, ఏఎస్సై జాకీర్, సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ అభినందించారు.

రూ.1,42లక్షల విలువైన గంజాయి..

నడికూడ : మండలంలోని చర్లపల్లి వద్ద నిషేధిత గంజాయిని గురువారం స్వాధీనం చేసుకున్నారు. పరకాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండ్ వద్ద స్కూటీపై ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని ఆపి తనిఖీ చేయగా 2.840 కేజీల గంజాయి రవాణా చేస్తు పట్టుబడ్డారు. అదుపులో తీసుకొని విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ నాగులూర్‌కు చెందిన పప్పల్ బాలయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచకు చెందిన ముదిగొండ ప్రశాంత్ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,42 లక్షల వరకు ఉంటుందని, నిందితులను అదుపులోకి తీసుకొని, పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.